పూడుకున్న సాగర్ ఉపకాలువలు

- పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారిన వైనం
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- పట్టించుకోని అధికారులు



తాడ్కోల్ శివారులో 10 నంబర్ ఉపకాలువ దుస్థితి

బాన్సువాడ రూరల్ : నిజాంసాగర్ ప్రధాన కాలువ ద్వారా ప్రస్తుతం విడతల వారీగా సాగునీరు పుష్కలంగా విడుదల అవుతోంది. ఉపకాలువలు అధ్వానంగా మారడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదు. దీంతో సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉపకాలువల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం, పూడిక చేరి అధ్వానంగా మారాయి. పలుచోట్ల రైతులు విరాళాలు పోగుచేసుకుని కాలువలో పూడికను జేసీబీలతో తీయించారు. పూడిక తీయించని ఉపకాలువలు పూడుకపోయి చివరి ఆయకట్టుకు సాగునీరు చేరడం లేదు.

బాన్సువాడ డివిజన్‌లో 19 ఉపకాలువలు

బాన్సువాడ సబ్ డివిజన్ పరిధిలో బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల పరిధిలో ప్రధాన కాలువకు 19 ఉపకాలువలు ఉన్నాయి. 8వ నంబర్ బుడిమి ఉపకాలువ మొదలుకుని 26వ నంబర్ వరకు విస్తరించి ఉన్నాయి. కాలువల నిర్వాహణ సరిగ్గా లేకపోవడంతో దట్టమైన చెట్లతో అనవాళ్లు కోల్పోతున్నాయి. దీంతో రైతులు సాగునీటి కోసం తెల్లవార్లు ఉపకాలువ వెంబడి జాగారం చేస్తూ ఒక్కొక్కరుగా తమ పంటపొలాలకు వరసతడులుగా పారించాల్సి వస్తోంది.



కొత్తాబాది వద్ద ఉపకాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

ప్రధాన కాలువకే పరిమితం..

బాన్సువాడ సబ్ డివిజన్‌లో గతంలో ముగ్గురు లస్కర్లు ఉండగా వీఆర్‌ఏలను నీటిపారుదల శాఖలోకి బదిలీ చేయడంతో వారి సంఖ్య 33కు చేరింది. వారంతా కార్యాలయం లేదంటే ప్రధాన కాలువపై పర్యవేక్షణకే పరిమితమవుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలు పరిష్కరించకపోవడంతో చివరి ఆయకట్టు కింది రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో పలుచోట్ల ఉపకాలువకు గండ్లుపడి సాగునీరు వృథా అవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

సాగునీటికి ఇబ్బంది అవుతోంది



నిజాంసాగర్ ప్రాజెక్టులో నీళ్లు పుష్కలంగా ఉన్నా తాము మాత్రం సాగునీటి కోసం ప్రతిరోజు ఇబ్బంది పడాల్సి వస్తోంది. గండ్లను పూడ్చి, పూడిక, పొదలు తొలగించాలి. రాత్రి పూట సాగునీటి కోసం వెళ్తున్న సమయంలో అడవి జంతువులు, పాములతో ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంది.

– పోచయ్య, రైతు, బుడిమి

ఉపాధిహామీలో పూడిక తీయించాలి



ఉపకాలువల్లో పూడికతీత పనులు చేయించాలని ఉపాధి హామీ అధికారులను కోరినా వారు పట్టించుకోవడం లేదు. కూలీలతో సులువైన పనులు చేయిస్తున్న అధికారులు, రైతులకు మేలు కూర్చే పనులు చేయిస్తే బాగుంటుంది. ప్రతి ఏడాది పూడిక పనులు చేస్తే చివరి ఆయకట్టుకు సాగునీరు చేరుతుంది.

–షేక్ అజీజ్, రైతు, రాంపూర్

చర్యలు తీసుకుంటాం

ఆయకట్టు పరిధిలోని రైతులు ప్రతి ఏడాది ఉపాధిహామీ అధికారులను సంప్రదించి కాలువలు శుభ్రం చేయించుకుంటే సమస్య ఉండదు. లస్కర్లు ప్రధాన కాలువ, తూముల పర్యవేక్షణ చేస్తున్నారు. అత్యవసరం ఉన్నచోట్ల లస్కర్లను పంపించి చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం.

–గజానంద్, ఏఈ, నీటిపారుదలశాఖ, బాన్సువాడ

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



కొయ్యగుట్టలోని సెంటర్‌ను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి



మద్నూర్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లంక్యాంపు, కొయ్యగుట్టలో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల్లో ఆదివారం నిర్వహించిన టీజీసెట్–2025–26 ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్ష ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. బోర్లంక్యాంపులోని సెంటర్‌లో 955మంది విద్యార్థుల్లో 23మంది గైర్హాజరైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. అలాగే కొయ్యగుట్టలోని సెంటర్‌లో 665మంది విద్యార్థుల్లో 22మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ లక్ష్మీబాయి తెలిపారు. కొయ్యగుట్టలో గల టీజీ పరీక్ష సెంటర్‌ను బాన్సువాడ సబ్ కలెక్టర్ డా. కిరణ్మయి తనిఖీ చేశారు.

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన టీజీసెట్–2025 ప్రవేశ పరీక్షకు 16మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ రఘు తెలిపారు. భిక్కనూరు పరీక్ష కేంద్రంలో 434 మంది విద్యార్థులకు, 418 మంది హాజరయ్యారని వివరించారు. బస్వాపూర్ ఆరోగ్య ఉప కేంద్రం ఏఎన్‌ఎం యాదమ్మ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు 597మందివిద్యార్థులకు గాను 593 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈపరీక్ష కేంద్రాన్ని ప్రిన్స్‌పల్ సురేఖ పరిశీలించారు.

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో గురుకుల ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈపరీక్షా కేంద్రాన్ని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. 181 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, ఇద్దరు గైర్హాజరయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ కవిత తెలిపారు.

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్షకు 171 మంది విద్యార్థులు హాజరయ్యారని పాఠశాల ప్రిన్స్‌పల్ గంగా కిషోర్ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ ముజీబ్, ఎస్సై విజయ్‌కొండ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ అధికారి జనార్దన్, పరిశీలకులు సుమన్, వెంకట్, సంతోష్, గణేష్, నరహరి, రాము, సమీనా తదితరులున్నారు.

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో గల గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో నిర్వహించిన గురుకుల పరీక్షకు 356 మందికి, 337 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ మాధవరావు తెలిపారు.

ఎల్లారెడ్డి: పట్టణంలో గురుకుల ప్రవేశ పరీక్షకు మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మోడల్ స్కూల్లో ఏర్పాటు చేసిన కేంద్రంలో 246 మందికి గాను 14 మంది గైర్హాజరు కాగా, గిరిజన గురుకుల పాఠశాల 399 మంది గాను 11 మంది గైర్హాజరు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన మరో కేంద్రంలో 516 మంది గాను ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పదో తరగతి ప్రతిభ పరీక్ష



కామారెడ్డి టౌన్: ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీ సాందీపని జూనియర్ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షను ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్ష ప్రశ్నాపత్రాన్ని ప్రముఖ న్యాయవాది క్యాతం సిద్ధరాములు, పట్టణ ఎస్సై బాల్ రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఈపరీక్షలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షలంటే భయం వీడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజయ్, అరుణ్‌కుమార్, సాందీపని కళాశాల ప్రిన్సిపల్ సాయిబాబా, రాజశేఖర్, నాయకులు రాహుల్, నితిన్, మణికంఠ, శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీబీపేటలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో...



బీబీపేట: మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ఆదివారం బీబీపేట బాలుర ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. మొత్తం 109 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి అక్షయకు రూ. 3వేలు నగదు అందించారు. రెండో, మూడో స్థానాల్లో నిలిచిన సీహెచ్. శ్రీనిధి మాందాపూర్, సీహెచ్. నిక్షితలు నగదు అందుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విష్ణు మోహన్, అరుంధతి, బాబు, పూర్వ విద్యార్థులు రవి, రాజు, స్వామి, ప్రసాద్, నవీన్, మహేష్, శ్రీనివాస్ , రఘుపతి, చంద్రశేఖర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి అంబేడ్కర్ యువజన సంఘం మద్దతు



కామారెడ్డి అర్బన్: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి పూర్తి మద్దతు ఇస్తున్నట్టు ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు బి.బాల్‌రాజ్ తెలిపారు. ఆదివారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని కలిసి మద్దతు తెలియజేస్తూ పత్రం అందజేసినట్లు బాల్‌రాజ్ పేర్కొన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి చెవ్వ లింగం, ప్రతినిధులు టి.స్వామి, కే.కుమార్, రమేష్, అశోక్, దేవరాజ్, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఆటల పోటీలు



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఏకలవ్య గురుకుల పాఠశాల మైదానంలో ఆదివారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఆటల పోటీల నిర్వహించినట్లు నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ సునీల్ రాథోడ్ తెలిపారు. మేరా యువ భారత్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, రన్నింగ్‌లు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. విజేతలకు ప్రిన్సిపల్ సురేష్ చంద్ర బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేసినట్లు తెలిపారు. స్పోర్ట్స్ ఇన్‌చార్జి స్వోజ్ యాదవ్, కుళవిందర్ మణి సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయిస్తా



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతో పాటు స్థలం కేటాయింపునకు సహకరిస్తానని మాజీ జెడ్పీచైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. ఆదివారం మహమ్మద్ నగర్‌లో ఆయన్ను అంబేడ్కర్ యువజన సంఘం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని యువజన సంఘం నాయకులు విజ్ఞప్తి చేయగా మాజీ జెడ్పీచైర్మన్ సానుకూలంగా స్పందించారని సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం మండల నాయకులు ఉన్నారు.

సంక్షిప్తం

రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్లకు సన్మానం



బీబీపేట: మండల కేంద్రంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇటీవల రిటైర్డ్ అయిన సరోజిని దేవి, విమల టీచర్లను ఆదివారం ఆయా కాలనీలకు చెందిన పలువురు ఘనంగా సన్మానించారు. రెండు కాలనీల్లోని గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు సేవ చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాలనీలకు చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

మాచారెడ్డి: మండల కేంద్రానికి చెందిన రాగిచెట్టు కింది అంజయ్య శనివారం అనారోగ్యానికి గురై మృతి చెందాడు. ఈ మేరకు ఆదివారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి తరఫున బీజేపీ నాయకులు ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, దేవరాజు సతీష్, శ్రీను, స్వామి గౌడ్, బాల్ నర్సు పాల్గొన్నారు.

రక్తదానం

కామారెడ్డి అర్బన్ : పట్టణ పరిధిలోని టేక్రియాల్‌కు చెందిన ఓ మహిళా గుండె ఆపరేషన్ కోసం అత్యవసరంగా బీ పాజిటివ్ రక్తం అవసరం కాగా సింగరాయపల్లికి చెందిన అంకం బాలకిషన్ రక్తదానం చేశారని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ ఎన్.బాలు తెలిపారు. రక్తదాత బాలకిషన్ అత్యవసర పరిస్థితిలో రక్తదానానికి ముందుకు రావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

50 గ్రాముల తునికాకు పెంపు

కామారెడ్డి రూరల్: మండలంలోని చిన్నమల్లారెడ్డి, దోమకొండ గ్రామల్లోని టెలిఫోన్ బీడీ సెంటర్‌లో పనిచేసే బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు 50 గ్రాముల తునికాకు పెంచినట్లు తెలంగాణ నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం తెలిపారు. ఈ మేరకు టెలిఫోన్ బీడీ కంపెనీల నిజామాబాద్ డివిజన్ మేనేజర్, సూపర్‌వైజర్ రమణలు తునికాకు పెంచుతున్నట్లు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. బీడీ కార్మికుల వద్ద అక్రమంగా ప్రతి నెల తీసుకునే బీడీలు బంద్ చేయాలని ఒప్పందం జరిగినట్లు పేర్కొన్నారు. పెంచిన 50 గ్రాముల తునికాకు వేయకపోతే, అక్రమంగా తీసుకునే బీడీలు బంద్ చేయకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పది



గంగాధర్‌ను సన్మానిస్తున్న ఎంఈవో

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని మండల విద్యాశాఖ అధికారి రామస్వామి అన్నారు.మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. హైస్కూల్‌లో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేసిన నామాగంగాధర్ పదవి విరమణ పొందారు. ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ పొందడం సహజమన్నారు. ఈసందర్భంగా గంగాధర్‌ను ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, గ్రామ పెద్దలు నరసింహరెడ్డి, బాలకృష్ణ, రాజయ్య , ఉపాధ్యాయులు గిరి, నివేదిత, రమేష్, శ్రీహరి, స్వేత, వాణిశ్రీ, విద్యార్థులు తదితరులున్నారు.

ఆధ్యాత్మికం..

నల్ల పోచమ్మ ఆలయంలో పోచారం పూజలు

బాన్సువాడ : పట్టణంలోని బేతాళస్వామి కాలనీలో నూతనంగా నిర్మించిన నల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. నల్ల పోచమ్మ విగ్రహా ప్రతిష్ఠాపన మహోత్సవం మూడు రోజుల పాటు కొనసాగుతోంది. వచ్చే నెల 2న బోనాల పండుగ నిర్వహించనున్నారు. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు.

నూతన వాహనం ప్రారంభించిన పోచారం



బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి కాలినడకన వచ్చే భక్తుల సౌకర్యార్థం నూతన వాహనాన్ని ఆదివారం పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులు స్వాగత తోరణం(అలిపిరి) నుంచి గుట్టపైకి కాలినడకన వచ్చే వారి సౌకర్యార్థం వాహనం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దేవునిపల్లి శివాలయంలో పూజలు



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి శివాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని అర్చకులు శశికాంత్‌శర్మ, శ్రీనివాస్‌రావుల ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు చేశారు. గ్రామానికి చెందిన జమాల్‌పూర్ మీనాక్షీ భుజంగరావు, భూంరావుగారి శ్రీకాంత్‌రావు శ్రీజ, గూడెల్లి సరస్వతి మల్లయ్య భూంరావుగారి శాంతాబాయి హరికిషన్ రావు, భూంరావుగారి జయసుధ సూర్యాజీరావు భూంరావుగారి సుగుణబాయి బాపురావుల దంపతుల ఆధ్వర్యంలో శివస్వాములకు బిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివబిక్ష కమిటీ అధ్యక్షుడు నిట్టు నారాయణరావు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

25న శివపార్వతుల కల్యాణ మహోత్సవం

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలోని అన్నపూర్ణ సహిత శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం, మహాశివరాత్రి ఉత్సవాలు ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నట్లు శివబిక్ష కమిటీ ప్రతినిధులు నిట్టు నారాయణరావు, చిన్నోళ్ల గోపాల్‌రావులు తెలిపారు. 26న రాత్రి 12.05 నిమిషాలకు లింగోద్భవకాల అభిషేకం, స్వామి వారి దర్శనం, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

ఘనంగా అచలగురు ఆశ్రమ వార్షికోత్సవం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అచలగురు ఆశ్రమంలో ఆదివారం 24వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మేలు కొలుపులు, లఘు పూజ, నగర సంకీర్తన, అచలగురు జెండా ఆవిష్కరణ, గురుపాద పూజ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. బొమ్మెర మురళీ మహరాజ్, బొల్లు నర్సింలు, అంకం కొండయ్య చిస్తీ, జంగం ప్రభులింగం, దాసరి అల్లూరి, సాయన్న, లక్ష్మయ్య, కృష్ణమూర్తి, మహిళలు, అచల గురు భక్తులు పాల్గొన్నారు.

ఓంశాంతి కేంద్రంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



కామారెడ్డి అర్బన్: శివరాత్రి జాగరణ, ఉపవాసంలో గొప్ప ఆధ్యాత్మిక రహస్యం ఉందని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి బ్రహ్మకుమారీ జయదీదీ అన్నారు. పట్టణంలోని ఓంశాంతి కేంద్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. శివ పతాకావిష్కరణ, లింగాభిషేకం, శాంతి ప్రతిజ్ఞ నిర్వహించారు. బీకే గంగలత, లలిత, బస్వాపూర్, దోమకొండ, తిమ్మక్‌పల్లి, రామాయంపేట సెంటర్ల ప్రతినిధులు ఉన్నారు.

శ్రీసత్యసాయి భజనమాల

శ్రీసత్యసాయిబాబా శతజయంతి సంవత్సరం సందర్భంగా ఆదివారం అయ్యప్పనగర్‌లోని శ్రీసత్యసాయి కేంద్రంలో భజనమాల నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ప్రతినిధులు పండరి, సహదేవ్, అశోక్, శోభ, విఠల్, శ్రీనివాస్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



పట్టణంలోని సిరిసిల్లరోడ్డులో గల శ్రీత్రిశక్తి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. త్రిశక్తి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, సామూహిక కుంకుమ పూజలు, ఓడి బియ్యం కార్యక్రమాలు నిర్వహించారు.

కొనసాగుతోన్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



బీబీపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



ఎల్లారెడ్డిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎల్లారెడ్డిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు


బీబీపేట: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోనే నర్సయ్య, మేడిపల్లి ప్రశాంత్, అందే శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంతో పాటు ఉప్పర్‌పల్లి, తుజాల్‌పూర్, జనగామ గ్రామాల్లో బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను కోరారు. బీజేపీ నాయకులు రంజిత్‌గౌడ్, నక్క రవీందర్, దేవరాజ్‌గౌడ్, స్వామి తదితరులున్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా మండల కేంద్రంతో పాటు సంతాయిపేట్, చిట్యాల, సోమారం తదితర గ్రామాలలో నాయకులు ప్రచారం చేశారు. నాయకులు పాల్గొన్నారు.

నిజాంసాగర్(జుక్కల్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్రచారం జోరుగా కొనసాగిస్తున్నారు. మహమ్మద్ నగర్, నిజాంసాగర్ మండలాల్లో ఆయా మండల పార్టీల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, మల్లికార్జున్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ యాదవ్, మల్లయ్యగారి ఆకాష్, చింతకింది కాశయ్య, తోట రాజు, అనీస్, రాముురాథోడ్ తదితరులున్నారు.

రాజంపేట: బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ విపుల్ జైన్ మాట్లాడుతూ మూడు ఎమ్మెల్సీ స్థానాలను బీజేపీ గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు పిట్ల శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు రాము, నాయకులు నవీన్, నరేష్, సుమన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద(జుక్కల్) : పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని బిచ్కుందలో బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. మండల అధ్యక్షుడు విష్ణు కార్యకర్తలతో కలిసి పట్టభద్రుల ఇంటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు.



బిచ్కుందలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కురుమ సాయిబాబా, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సామెల్, స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. అలాగే బీజేపీ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా ఎన్నికల ఇన్‌చార్జి హేమారెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు పెద్ద ఎడ్ల నర్సింలు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి బాలకిషన్, మాజీ సర్పంచ్ దేవేందర్, నాయకులు ఎస్ఎన్ రెడ్డి జోరుగా ప్రచారం సాగిస్తున్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి తరపున ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి, కాంగ్రెస్ గ్రామకమిటీ అధ్యక్షుడు కిరణ్, మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ నాయకులు రమేష్, ఆసిఫ్ తదితరులున్నారు. అలాగే మండలంలోని జప్తిజాన్కంపల్లిలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య తరపున బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేవైఎం నాయకులున్నారు.

ఇంద్రజాలికుడికి సన్మానం



భిక్కనూరు: మండల కేంద్రంలో రామదండు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ ఇంద్రజాల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కంచర్ల గ్రామానికి చెందిన ఇంద్రజాలికుడు సంతోష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మండల వైశ్య సంఘం అధ్యక్షుడు పురం రాజమౌళి, రామదండు సభ్యులు మెడికల్ రమేష్, శ్రీనివాస్, రవి, తమ్మాలి సాయి పరమేశ్, దాస్, అశోక్, స్వామి, చింటు తదితరులు పాల్గొన్నారు.